# అర్ధనారీశ్వరం

'శిల్పి'

**రాధిక స్టేజి మీదనున్న అర్జున్‌కేసి తదేకంగా చూస్తోంది. 'నిజమే. ఆడదాని వేషం చాలా చక్కగా ఒప్పిస్తున్నాడు. ప్రేక్షకులు చప్పట్లు కొట్టారంటే కొట్టరూ? ప్రైజు ఖాయం అని వెనక్కాల గుసగుసలు పోతున్నారుకూడా! తెలియని వాళ్లు ఆడపిల్లే వేషం వేస్తోందనుకుంటారుకూడా! అంత బాగా నప్పాడు.'**

కానీ అలా నప్పడమే తనకు నచ్చలేదు. ఆ ఆఫర్ వచ్చినప్పుడు అర్జున్ వెంటనే చెప్పాడు-"ఈ సారి కాలేజీ నాటకాల పోటీలో వేషం వేయమంటున్నారు. ఫరే ఛేంజ్ అమ్మాయిగా వేయమంటున్నాడు సురేష్.." అంటూండగానే తను కట్ చేసింది.

"వద్దనలేకపోయావా? నువ్వు అమ్మాయిలా కనబడుతున్నావా వాళ్ల కళ్లకు?" అంది చికాకు పడుతూ.

అర్జున్ కోపం తెచ్చుకోలేదు. "నీ కళ్లకు హీరోలా కనబడుతున్నానుగా, అది చాలు! తక్కినవాళ్లు ఏమనుకొంటే నాకేం?... అది సరేలే. విషయం ఏమిటంటే... లేడీ కారెక్టరు పెద్దది. చాలా ముఖ్యమైంది. సురేష్ హీరోగా వేస్తున్నాడు. మొన్న కాలేజీ ఎలక్షన్లో లేడీస్ అంతా సురేష్‌కి వ్యతిరేకంగా ఓటేశారుగా! ఇప్పుడెళ్లి వాళ్లను బతిమాలడం ఇష్టంలేక నన్ను రిక్వెస్టు చేశాడు. పోనీ మనదీ పెద్ద పర్సనాలిటీ కాదుగా, హీరోయిన్‌గా వేస్తే ఎలా వుంటుందో చూద్దామని..." అంటూ అర్జున్ నచ్చజెప్పాడు.

కానీ తనకా ఐడియానే నచ్చలేదు. ఆడదానిలా కులికేవాణ్ని తను ప్రేమించగలదా? ఛ. ఛ! అనుకొంది. ఇప్పుడు స్టేజీమీద అర్జున్‌లో అచ్చమైన ఆడతనం చూస్తున్నకొద్దీ తన ఊహ కరెక్టే అనిపిస్తోంది. 'ఇతనిలో మగవాడు కనబడటం లేదు. ఈ ఆడంగివాణ్ని ప్రేమించడం ఏమిటి, అసహ్యంగా! ఆడవాళ్లు ఆడవాళ్లలా కనబడాలి, మగాళ్లు మగాళ్లలా వుండాలి. మీసాలున్న ఆడవాళ్లన్నా, వయ్యారంగా నడిచే మగాళ్లన్నా తనకసలు ముందు నుంచీ అసహ్యం! అమితాబ్ బచ్చనైనా కానీ, బారాత్ సీన్‌లో ఆడవాళ్లలా వగలు ఒలకబోస్తే ఒళ్లు మండుతుంది. అలాటిది ఇప్పుడు తన లవరే... ఇలా... నయం! తన ప్రేమ ఇంకా తొలిదశలోనే వుంది! ఈజీగా బైబై చెప్పెయ్యవచ్చు!' అనుకుంది రాధిక.

నాటకం సాగుతూనేవుంది. ప్రేక్షకులు అర్జున్ నటనకు పులకించిపోతున్నకొద్దీ ఆమెకు దుస్సహంగా వుంది. లేచి బయటకు వచ్చింది.

ఇంతలో ఇంటర్వల్ వచ్చింది. లత కనబడింది.

"రాధికా, రా! గ్రీన్‌రూమ్‌కెళ్లి అర్జున్‌ను కంగ్రాచ్యులేట్ చేసివద్దాం. మన క్లాస్‌మేట్ కదా! ఎంకరేజ్ చెయ్యకపోతే ఎలా?" అని గ్రీన్‌రూమ్‌కు లాక్కెళ్లింది.

రాధిక కంటబడగానే అర్జున్ కళ్లు నవ్వాయి. చుట్టూ ఎంతమంది అభినందనలు కురిపిస్తున్నా అతని కళ్లు ఆమెనే వెంటాడుతున్నాయి. లత వెనక్కాలే వెళ్లింది రాధిక. "వేషం బాగా కుదిరింది" అనడానికి ఆమెకు మనసు రాలేదు. "ఇంటర్వెల్ తర్వాత కూడా ఇంకా పోర్షన్ వుందా?" అంది సింపుల్‌గా.

"ఆఁ. ఇప్పణ్నుంచి ఆధునికయువతిలా వేషం వేయాలి. పట్టుచీర విప్పి పారేసి బట్టలు మార్చుకుందామనుకుంటే గ్రీన్‌రూమ్ పట్టకుండా జనం! అభినందనలు చెప్పేవాళ్లు ఎక్కువైపోయారు. ఎలాగాని చూస్తున్నాను" అన్నాడు అర్జున్. ఒక్క క్షణం ఆగి, "లేడీస్ మేకప్ రూమ్‌లో కాస్త చూడు. వాళ్లంతా డ్రెస్ చేసుకొని వింగ్స్‌లోకి వెళ్లినట్టున్నారు. ఖాళీగా వుంటే అక్కడ డ్రెస్ మార్చుకుంటాను. టైమైపోతోంది" అన్నాడు.

లేడీస్ మేకప్ రూమ్ ఖాళీగానే వుంది. ఒకే ఒక అమ్మాయి కనుబొమలు దిద్దుకుంటోంది. అర్జున్ బట్టలు పట్టుకుని లోపలికి దూరాడు. "అక్కడున్న బాబ్డ్ హెయిర్ విగ్ తెచ్చిపెడతావా?" అంటూ రాధికను పిలిచాడు. రాధిక వెంటవెళ్లింది.

కనుబొమలమ్మాయి వీళ్లని పట్టించుకోలేదు. ఆడవాళ్లే అనుకొందేమో!

అర్జున్ గబగబా పాత డ్రెస్సు విప్పాడు. చిన్న డ్రాయర్‌తో మిగిలాడు. అతనికి బట్టలందిస్తూ రాధిక అతని కాళ్లకేసి చూసింది. మంచి షేపైన కాళ్లు, చిక్కగా పెరిగిన రోమాలు. అతన్ని ఇలా చూసే అవసరం, అవకాశం ఇప్పటిదాకా రాధికకి కలగలేదు. 'ఇలాటి ఫంక్షన్లో సిగ్గుయెగ్గులు మరిచిపోతారేమో, లేకపోతే అర్జున్ తన ఎదుట ఇలా అర్ధనగ్నంగా కనబడే సాహసం చేసేవాడా?' అని రాధిక ఆలోచిస్తూండగానే అర్జున్ కొత్త వేషం వేసుకోవడం పూర్తి చేశాడు. విగ్గు పెట్టుకోవడం తరువాయి.

గదిలోంచి కనుబొమలమ్మాయి వెళ్లిపోవడంతో, అతని ట్రూపు వాళ్లు మగాళ్ల గ్రీన్ రూమ్ లోంచి స్టేజి మీదకు వెళ్లిన అలికిడి వినబడటంతో, అతనికి ధైర్యం వచ్చినట్టుంది. దొరికిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుందామనుకొని రాధిక జబ్బ పట్టుకొని దగ్గరకు లాక్కొన్నాడు. వద్దు వద్దనుకుంటూనే రాధిక ముందుకడుగేసింది. అతని అర్ధనగ్నశరీరం కంటబడటం ఆమెపై మత్తు జల్లిందేమో, ఏం జరుగుతోందో తెలిసేలోపున ఆమె అతని కౌగిలిలో వుంది.

అదే వారి తొలి కౌగిలి!

బిగికౌగిలికి తన పెట్టుడు ఛాతీ అడ్డు వస్తోందని గ్రహించాడులా వుంది, అర్జున్ ఆమె పిరుదులు పట్టుకుని ముందుకు లాక్కుంటూ తన కాలితో ఆమెను చుట్టేశాడు.

ప్రేక్షకుల పొగడ్తల నిషా, చప్పట్ల నిషా తలకెక్కి ఉద్వేగం పొందిన అతని శరీరం శ్రుతి చేసిన వాద్యంలా వుంది. ఆర్తిగా కౌగలించుకొన్నాడామెను, తనలో పూర్తిగా ఇమిడ్చేసుకుందామనుకున్నట్లు. దృఢమైన అతని శరీరం ఆమెలో స్త్రీత్వాన్ని మేల్కొల్పింది. అతని మగతనాన్ని గుర్తు చేసింది. తల పైకెత్తి ఆర్తిగా చూసింది. అతను చప్పున ఆమె పెదాలందుకున్నాడు. గట్టిగా చుంబించాడు. వేషం కోసం మీసం తీసేసిన అతని పైపెదవి ఆమె ముక్కుకు గరుకుగా తగిలింది. కౌగిలినుంచి విడివడుతూనే, "ఇంతకీ నువ్వు ఆడా, మగా, లేక బృహన్నలా? అది చెప్పు!" అంది.

"అర్ధనారీశ్వరం. ప్రతివ్యక్తిలోనూ ఆడలక్షణాలూ వుంటాయి, మగలక్షణాలూ వుంటాయి. తెలీదూ?" అంటూ మళ్లీ పెదాలు

అందుకోబోయేడు.

ఇంతలో "అర్జున్‌గాడేడిరా? బాత్‌రూమ్‌లో వున్నాడా?" అని కేక వినబడింది.

ప్రేమికులు చటుక్కున విడిపోయారు. రాధిక సర్దుకొని వెళ్లి అద్దం ముందు చూసుకోసాగింది, తనూ ఏదో పాత్ర వేస్తున్నట్లు.

అర్జున్ చల్లగా జారుకొని, ఎవరి కంటా పడకుండా స్టేజిమీదకు చేరుకున్నాడు.

ఇంటర్వెల్ తర్వాత అర్జున్ పాత్ర మరింత రక్తి కట్టింది. చూస్తున్న రాధికకు ఇబ్బందిగా ఏమీ లేదు. ఆమెకు అర్జున్‌లో స్త్రీ కనబడటం లేదు. సంపూర్ణపురుషుడే అగుపిస్తున్నాడు, అతని బిగికౌగిలి తాలూకు ఒత్తిడి ఆమె శరీరం మరువలేనందుకు! ■

